ప్రజాశక్తి

మంగళవారం 12 సెప్టెంబర్ 2023   8 పేజీలు

గుంటూరు

పల్నాడు

గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ బస్సులపైకి ఎక్కి ఆందోళన చేస్తున్న టిడిపి శ్రేణులు

వినుకొండ పోలీస్‌స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న టిడిపి, జనసేన, సిపిఐ ఆందోళన

బంద్ ప్రశాంతం

- ఎక్కడికక్కడ నేతల గృహ నిర్బంధం
- ప్రతిఘటించిన టిడిపి నేతలు
- ముందస్తు అరెస్టులతో పోలీసుల నియంత్రణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కొన్ని చెదురుమదురు ఘటనలు మినహా బంద్ ప్రశాంతంగా జరిగింది. టివడిపి కార్యకర్తలు, నాయకులను పోలీసులు ఎక్కడెక్కడ అరెస్టు చేశారు. విద్యా సంస్థలకు ముందే సెలవులు ప్రకటించారు. కొన్ని వ్యాపార సంస్థల వారు మధ్యాహ్నం వరకు వాణిజ్య సముదాయాలను తెరవలేదు. ఉదయం కొద్దిసేపు ఆర్‌టిసి బస్సులు నిలిచిపోయాయి. బ్యాంకులు మూతపడ్డాయి. దుకాణాలు, వాణిజ్య సంస్థలు ఉదయం వేళ పనిచేయలేదు. ప్రైవేటు వాహనాలు, చిన్న దుకాణాలు యథాతథంగా పనిచేశాయి. 144 సెక్షన్ అమలులో ఉన్నా చాలాచోట్ల ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహించారు. సత్తెనపల్లి, నర్సరావుపేటలో అరెస్టయిన టిడిపి నాయకులకు సిపిఎం నాయకులు సంఘీభావం ప్రకటించారు. గుంటూరులో మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నక్కా ఆనంద్‌బాబు, చిలకలూరిపేటలో పత్తిపాటి పుల్లారావు తదితరులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. తాడేపల్లిలో టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్‌ను బయటకు రానివ్వలేదు.

పిడుగురాళ్ల, సత్తెనపల్లి తదితర ప్రాంతాల్లో టిడిపి కార్యకర్తలు సెల్ టవర్లు ఎక్కి నిరసన తెలిపారు. వినుకొండ, గురజాల తదితర ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఆర్‌టిసి బస్సులపై రాళ్లు రువ్వారు. బంద్‌లో టిడిపితో పాటు జనసేన నాయకులు కూడా పాల్గొన్నారు. సీనియర్ నాయకులు అందర్నీ గృహ నిర్బంధం చేశారు. గుంటూరులో మూసిన షాపులను వైసిపి నాయకులు తెరిపించడంతో వివాదానికి దారితీసింది. మేయర్, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తీరునకు నిరసనగా జనసేన నాయకులు మరోసారి ఆందోళనకు పూనుకున్నారు. మద్దాల గిరి, మేయర్ కావటి మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో కర్రలు తీసుకొని హల్ చల్ చేయడంతో తీవ్ర వివాదానికి దారితీసింది. పోలీసు లాఠీలతో మేయర్ దుకాణాలు తెరిపించడం ఏమిటని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు.

గుంటూరు ఆర్‌టిసి బస్టాండ్‌లో బస్సులపైకి వెళ్లి

▶ 2లో

సమస్యలను విస్మరించి అరెస్టులు

అరవిందబాబును పరామర్శిస్తున్న గుంటూరు విజయ్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రాష్ట్రంలో నెలకొన్న సమస్యల గురించి ప్రభుత్వం పట్టించుకోకుండా కక్షపూరిత రాజకీయాలకు తెర తీయడం దుర్మార్గమని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ విమర్శించారు. చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నిరసన తెలుపుతున్న టిడిపి నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబును పోలీసులు అరెస్టు చేసి ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయన్ను విజయ్ కుమార్ పరామర్శించి విలేకర్లతో మాట్లాడారు. పంటలు ఎండిపోయి కరువు విలయతాండవం చేస్తుంటే రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం ఆ పని మానేసి అక్రమ అరెస్టులుపై దృష్టి సారించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు నాయుడు తప్పు చేసి ఉంటే ముందస్తు నోటీసు ఇచ్చి స్పందించకపోతే అరెస్టు చేయాల్సి ఉంటుందని, అయితే చంద్రబాబు నాయుడు అరెస్టులో పోలీసులు నిబంధనలు పాటించలేదని అన్నారు. అరెస్ట్ పట్ల టిడిపి శ్రేణులు బంద్ చేయడం సహజమని, అయితే అరెస్టులకు పూనుకున్న పోలీసులు వారిని పరామర్శించడానికి అవకాశం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని చెప్పి పట్టించుకోకపోవడంతో నిరసన తెలుపుతుంటే ప్రతి ఉద్యమాన్ని ప్రభుత్వం పోలీసులు అడ్డంపెట్టి అడ్డుకుంటోందన్నారు. ధర్నాలకు పోలీసులు అనుమతులు ఇవ్వకపోతే కోర్టుకు వెళ్లి అనుమతులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి రాష్ట్రంలో దాపరించిందన్నారు. పాలకులు కక్షపూరితంగా వ్యవహరిస్తే ఆ రాష్ట్రం అభివృద్ధి చెందదని

▶ 2లో

అరెస్టులు అప్రజాస్వామికం : సిపిఎం ఖండన

ప్రజాశక్తి-గుంటూరు

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా సోమవారం జరిగిన బంద్ సందర్భంగా అనేక మంది తెలుగుదేశం, వామపక్ష పార్టీల నాయకుల్ని అరెస్ట్ చేయటం అప్రజాస్వామికం అని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని, శాంతియుతంగా బంద్ జరుగుతున్న నేపథ్యంలో గహనిర్బంధాలు, అరెస్టులు చేయడం రాజ్యాంగ విరద్ధమని పేర్కొన్నారు. గుంటూరులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజిని అరెస్టు చేసి నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఉంచారని తెలిపారు. నిరసన తెలియచేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ప్రభుత్వం నిర్బంధం ఈ హక్కును కాలరాయడమేనని విమర్శించారు.

వర్షాలకు నీట మునిగిన తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని ఆకుకూర మడులు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భారీవాన

బెట్టకు వచ్చిన పైర్లకు మేలు - మిర్చి సాగుకు పెరిగిన అవకాశాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు దాదాపు అన్ని మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఈ వర్షం వ్యవసాయానికి బాగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ప్రధానంగా పల్నాడు జిల్లాలో బెట్టకొచ్చిన పైర్లకు ఈ వర్షం మేలు చేకూరుస్తుందని అధికారులు తెలిపారు. నెల రోజుల్లో కురవాల్సిన వర్షం ఒక్క రోజులోనే కురిసిందని అధికార వర్గాలు తెలిపాయి. మెట్ట ప్రాంతంలో మిర్చి సాగుకు ఈ వర్షం బాగా ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు.

గుంటూరు జిల్లాలో సెప్టెంబరులో 145.2 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా సోమవారం వరకు 161.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం విశేషం. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. తాడికొండ 111.6, మంగళగిరి 107, దుగ్గిరాల 103.4, పొన్నూరు 101.8, తాడేపల్లి 98.6, కొల్లిపర 95.2, తుళ్లూరు 94.2, పెదకాకాని 71.8, ప్రత్తిపాడు 60.4, గుంటూరు ఈస్టు 45.6, మేడికొండూరు 44, గుంటూరు పశ్చిమ 42, వట్టిచెరుకూరు 38.4, కాకుమాను 32.4, చేబ్రోలు 32, తెనాలి 29.2, పెదనందిపాడు 28.4, ఫిరంగిపురం 26.8 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. పల్నాడు జిల్లాలో ఈనెలలో 134.5 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటి వరకు 130.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గత నాలుగు నెలల్లో అవసరాని కంటే అధికంగా వర్షం కురిసింది ఈ నెలలోనేనని అధికారులు తెలిపారు.

మండలాల వారీగా గత 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడు 116.4, క్రోసూరు 98, మాచర్ల 90.2, గురజాల 85.2, ఈపూరు 72.2, బొల్లాపల్లి 71.8, దుర్గి 70.8, అచ్చంపేట 60.6, పిడుగురాళ్ల 47.4, నర్సరావుపేట 46.6, అమరావతి 46.4,మాచవరం 45.6, వెల్దుర్తి 43, ముప్పాళ్ల 36.4, శావల్యాపురం 36.2, యడ్లపాడు 35.2, దాచేపల్లి 34, కారంపూడి 33.4, నాదెండ్ల 30.4, సత్తెనపల్లి 29.2, రెంటచింతల 26.2, చిలకలూరిపేట 25.4 మిల్లీమీటర్లు నమోదైంది.

మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

ఆకాశమే హద్దుగా విద్యార్థులు ఎదగాలి

- ఎఎన్‌యు 46వ, 47వ వ్యవస్థాపక దినోత్సవంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి
- ప్రముఖులకు ప్రతిభాపురస్కారాలు

వార్త మెయిన్‌లో

బంద్ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

బయటకు వెళ్తున్న బస్సులను టిడిపి నాయకులు నశీర్ అహ్మద్ అడ్డుకున్నారు. గుంటూరులో డిపోల నుంచి బయటకు వెళ్తున్న బస్సులను తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ ఆధ్వర్యంలో గాలి తీసి నిలువరించారు. బస్సులపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. తాడేపల్లిలో సిఎం జగన్ దిష్టిబొమ్మను టిడిపి నాయకులు దహనం చేశారు. కుంచనపల్లిలో టిడిపి, జనసేన నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. తెనాలిలో జరిగిన బంద్‌లో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. తాడికొండ, పెదకాకానిలో బంద్ ప్రశాంతంగా జరిగింది. ప్రత్తిపాడులో అరెస్టు చేసిన నాయకులకు నల్లపాడుపోలీసు స్టేషన్‌లో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బి.రామాంజనేయులు పరామర్శించారు. మంగళగిరిలో టిడిపి, జనసేన, ఎమ్మార్పీఎస్, సిపిఐ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. పాత టైరు తగలబెట్టారు. కొంతమంది సిఎం జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో బంద్ సంపూర్ణంగా జరిగింది. టిడిపి, జనసేన, సిపిఐ పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్ తరలించారు. యడ్లపాడులో టిడిపి నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను గుంటూరులో గృహనిర్బంధంలో ఉంచారు. మాచర్లలో బంద్ ప్రభావం కన్పించలేదు. పిడుగురాళ్లలో టిడిపి నాయకులు నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది.

భావితరాల భవిష్యత్ అధ్యాపకులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక టి. జె. పి. యస్. కళాశాల లో తెలుగు అధ్యాపకులు డాక్టర్. జె. వి. సుధీర్ కుమార్ కు, సంస్కృత అధ్యాపకులు డాక్టర్.ఏ.అంజనీ కుమార్ లకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సౌత్ ఇండియా ఐకానిక్ పురస్కారాలు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ. ఏ. బి. పి. మనోహర్ తెలియచేశారు. అభినందన కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ ప్రతి అధ్యాపకుని జీవితంలో మరచిపోలేని రోజు ఇటువంటి పురస్కారాలు రావడం అని, అధ్యాపకులు నిరంతర విద్యార్థులులాగా ఉండాలని, అటువంటప్పుడే విద్యార్థుల భవిష్యత్ ని చక్కగా మలచగలరని పురస్కారాలు పొందిన వీరికి హదయ పూర్వక శుభాకాంక్షలు అని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ %డ% కరస్పాండంట్ శ్రీ. కె. వి. బ్రహ్మం గారు మాట్లాడుతూ ఈ ప్రపంచం ఒక క్రమ పద్ధతిగా వెళు ్తంది అంటే దానికి ఎక్కువ కారణం అధ్యాపకులని, భవిష్యత్ తరాల పునాదులు అధ్యాపకులని కొనియాడారు. మా కళాశాల అధ్యాపకులు ఇద్దరికి పురస్కారాలు రావడం ఎంతో సంతోషమని చెప్పారు. కార్యక్రమం లో శ్రీమతి, జయ శైలజ, శ్రీమతి, యమ్. విజయశ్రీ పాల్గొన్నారు.

కొలకలూరులో సమస్యాత్మకంగా వీరమ్మ చెరువు

- వీధులన్నీ జలదిగ్బంధం..ఇళ్ళలోకి చేరుతున్న పాములు
- భయాందోళనల్లో స్థానికులు

బాపయ్యపేట-కోనేటిపురం రోడ్డుపై నిలిచిన నీరు

ఆంకమ్మ గుడి వీధిలో ఇళ్ళను చుట్టుముట్టిన మురుగు నీరు

ప్రజాశక్తి-తెనాలి

గ్రామంలో ఉన్న చెరువు ప్రజలను కష్టాల ఊబిలోకి నెడుతోంది. చెరువు నిండితే నీరు బయలకు పోయే మార్గంలేదు. గతంలో ఉన్న తూములు మూసుకు పోయాయి. దీంతో వర్షం పడితే చెరువు నీటితో చుట్టుపక్కల ఉన్న వీధులన్నీ జలమయమౌతున్నాయి. పేరుకు సిమెంట్ రోడ్లే అయినా వర్షంపడితే చెరువునీటితో పాటు మురుగునీరు ఏకమై ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రూరల్ గ్రామం కొలకలూరులో ఉన్న వీరమ్మ చెరువు దుస్థితికి చెందిన వివరాలిలా ఉన్నాయి.

తెనాలి నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగి, మేజరు గ్రామ పంచాయతీగా ఉన్న కొలకలూరులో ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకునే తీరిక పంచాయతీ సిబ్బందికీలేదు. శాసనసభ్యులకు అంతకంటే పట్టదు. దీంతో ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గ్రామంలోని గంగానమ్మపేట గుడి ఎదురుగా ఉన్న వీరమ్మ చెరువు గుర్రపుడెక్క, తూటికాడతో పూడుకు పోయింది. గతంలో చెరువు నిండితే నీరు బయటకు పోయేందుకు తూములుండేవి. ఆ తూముల ద్వారా నీరు పంటకాలువలకు చేరేది. అయితే ప్రస్తుతం ఆ తూములు పూడుపుకోయాయి. ఆలాగే తూములున్న కల్వర్టు కూడా కుంగిపోయింది. పైగా ఈ నీరు పారే పంట కాలువకు కూడా స్థానికులు కొన్ని చోట్ల అడ్డంకులు సృష్టించారు. దీంతో వర్షం పడితే చెరువు నిండి నీరు రోడ్లపైకి చేరుతుంది. పైగా ఈ ప్రాంతంలో సైడు కాలువలు లేవు. చెరువు నిండిన సమయంలో ఆ నీటితో పాటు మురుగు కూడా ఏకమై ఇళ్ళలోకి చేరుతుంది. చెరువులో ఉండే పాములు, కప్పలు, ఇతర జలచరాలు ఇళ్ళలోకి చేరుతున్నాయి. ఇదిలా ఉంటే సైడు కాలువలు కూడా లేకపోవటంతో నీరు రోడ్డుపైనే నిలిచిపోతున్నాయి. కోనేటిపురం సెంటర్ నుంచి గంగానమ్మపేటకు వెళ్లే రోడ్డు, అంకమ్మ తల్లి గుడి పక్క రోడ్డు, ఆర్‌జె కళాశాల రోడ్లపై నీరు నిలిచిపోతున్నాయి. సిమెంట్ రోడ్లు ఉండి కూడా ఉపయోగంలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చెరువు, డ్రెయినేజ్ సమస్యపై పంచాయతీకి పిర్యాదు చేసినా పట్టించుకునే తీరిక లేదని స్థానికులు వాపోతున్నారు.

సమస్యాత్మకంగా ఉన్న వీరమ్మ చెరువు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేకు ఫిర్యాదు

ఇటీవల గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ప్రాంతంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా కోనేటిపురం, గంగానమ్మపేట స్థానికులు చెరువు సమస్యతో పాటు, సైడు డ్రెయిన్ల నిర్మాణంపై ఎమ్మెల్యేకు వివరించారు. సమస్య తీవ్రతపై ఏకరువు పెట్టారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్న ఎమ్మెల్యే నుంచి ఇప్పటికీ ఎలాంటి స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీతో పాటు ఎమ్మెల్యే కూడా సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

పాఠశాలల్లో జూనియర్ రెడ్‌క్రాస్ విభాగాలు

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో జూనియర్ రెడ్‌క్రాస్ వింగ్స్ ఏర్పాటు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జూనియర్ రెడ్‌క్రాస్ సమావేశంలో పాల్గొన్న జెసి మాట్లాడుతూ విద్యార్థుల్ని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటానికి, సామాజిక బాధ్యతల పట్ల అవగాహనకు పాఠశాల స్థాయి నుండే తగు శిక్షణ అందచేయటానికి రెడ్‌క్రాస్ ద్వారా తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నివారణ చర్యలు, ఆరోగ్య మెళకువలు, సామాజిక సేవా కార్యక్రమాలలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. కావున ప్రతి విద్యార్థిని జూనియర్ రెడ్‌క్రాస్ సభ్యునిగా చేర్చాలని అధికారుల్ని ఆదేశించారు. సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు, జిల్లా కోశాధికారి ఎ.రవిశ్రీనివాస్, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ శ్రావణ్‌బాబు, డిఇఒ పి.శైలజ, కళాశాల విద్య ఆర్‌జెడి డాక్టర్ జోత్స్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ, బాలుడు అదృశ్యం

చాకచక్యంగా కేసును చేధించిన పోలీసులు

ప్రజాశక్తి తెనాలి

మతిస్థిమితం లేని మహిళ ఓ బాలుడితో సహా అదశ్యమైన కేసును పోలీసులు చాకచక్యంగా గంటల వ్యవధిలోనే చేధించారు. పట్టణ త్రీ టౌన్ సిఐ రమేష్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక చంద్రబాబునాయుడు కాలనీ ఆరో లైన్ లో నివాసం ఉంటున్న బంధువుల ఇంటికి, వారి సమీప బంధువు గిరిజ అనే మహిళ సోమవారం సాయంత్రం వచ్చింది. ఆమె అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోతుంది. కొంచెం సేపు కుటుంబ సభ్యులతో ముచ్చటించిన ఆమె, అకస్మాత్తుగా ఇంటి నుంచి వెళ్ళిపోయింది. ఆమె వెళ్లిన కొద్దిసేపటికి ఇంట్లోని నాలుగేళ్ల బాలుడు గౌతం విగ్నేష్ కూడా కనిపించకపోవడాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. వారిద్దరి కోసం ఇంటికి సమీపంలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. స్పందించిన సిఐ, ఎఎస్ఐ హైదరాలి తో పాటు సిబ్బందిని అదశ్యమైన మహిళ ,బాలుడిని వెతికేందుకు నియమించారు. వారు ఆటోకు మైకును ఏర్పాటుచేసి ఆ ప్రాంతమంతా మహిళ, బాలుడు వివరాలు వెల్లడిస్తూ వెతకడం ప్రారంభించారు. అలాగే,పట్టణంలోని ప్రధాన కేంద్రాలలో సిసి కెమెరాలు పరిశీలించారు. ఈ నేపథ్యంలో మార్కెట్ వంతెన సమీపంలోని ఎడ్ల లింగయ్య పెట్రోల్ బంకు వద్ద నడుస్తూ వెళు తున్నట్లు సిసి టివి పుటేజిలో మహిళను బాలుడిని గుర్తించారు. వెంటనే అక్కడ ఆటో డ్రైవర్లను ఆరా తీశారు. అయినప్పటికీ సమాచారం లేకపోవడంతో బస్టాండ్ వరకు వెతికారు. బస్టాండ్ సమీపంలో బాలుడిని, మహిళలు గుర్తించారు. ఇరువురినీ క్షేమంగా వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. చాకచక్యంగా వ్యవహరించి, గంటల వ్యాధిలోనే ఇరువురిని గుర్తించి కుటుంబ సభ్యులుకు అప్పగించడం పట్ల వారు పోలీసులకు కతజ్ఞతలు తెలిపారు.

సమస్యలను విస్మరించి అరెస్టులు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ప్రతిపక్ష నాయకులు నేరాలు చేస్తే నేరాలు నిరూపించి శిక్ష వేయాలి కానీ కక్షపూరిత ధోరణి పనికిరాదన్నారు. నిరసన కార్యక్రమాలు హింసాత్మంగా మారిన నేపథ్యంలో లేదా ప్రజలకు ఇబ్బంది కలిగిన నేపథ్యంలో మాత్రమే అరెస్టులు చేయాల్సి ఉంటుందని, అలా కాకుండా నియంతలుగా వ్యవహరిస్తే ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అరవిందబాబును పరామర్శించిన వారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్, నాయకులు డి.శివకుమారి, మస్తాన్‌వలి, రబ్బాని, ఆంజనేయులు, వెంకయ్య, ప్రేమసాగర్ ఉన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

'స్పందన'లో అర్జీలను స్వీకరించిన జిల్లా క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ

గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో స్పందన అర్జీలను జిల్లా క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు బాధితుల నుండి సోమవారం స్వీకరించారు. జిల్లాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై సం బంధించిన అధికారులతో ఫోన్లో మాట్లాడి చట్ట పరిధిలోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థికపరమైన అంశాలతో పాటు సమస్యలతో ఇతర సైబర్ సమస్యలపై ఎక్కువ మంది ఫిర్యాదు చేసినట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో దిశా డిఎస్పి రామారావు, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఇంటికి వచ్చి దాడి చేశారు

శ్రీరామ్ చిట్స్ ,ఫైనాన్స్ మేనేజర్ సిబ్బందితో ఇంటికి వచ్చి తనతో పాటు తన కుమారుడిపై భౌతిక దాడి చేశాడని, అమర్తలూరు మండలం, పెదపూడి గ్రామానికి చెందిన మల్లవరపు వెంకటరాజు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆర్థిక అవసరాల నిమిత్తం పొన్నూరు శ్రీరామ్ చిట్స్, ఫైనాన్స్,లో తనకున్న ట్రాక్టర్ తో పాటు తన కొడుకు రాధాకృష్ణ లారీ తనఖా పెట్టి రూ.6,లక్షలు అప్పుగా తీసుకొని, ప్రతి నెల ఈఎమ్ఐల రూపంలో చెల్లింపులు జరిపామన్నారు. అప్పుగా తీసుకున్న మొత్తం రూ.6 లక్షల తో పాటు వడ్డీలు, లేట్ ఫీజులు సహా ఇప్పటికీ రూ.16 లక్షలు కట్టి ఫైనాన్స్ కంపెనీకి అప్పు పూర్తి చేశామన్నారు. అయినప్పటికీ ఫైనాన్స్ మేనేజర్ పూర్ణ వెంకటేశ్వర్లు, కలెక్షన్ మేనేజర్ చందు, ఏజెంట్ జయపాల్, మస్తాన్ వలిలు తన ఇంటి వద్దకు వచ్చి ఇంకా రూ.5 లక్షలు తాము కట్టాల్సి ఉందని, కట్టకపోతే ఊరుకోమంటూ తనపై, తన కుటుంబ సభ్యులపై భౌతిక దాడులకు దిగుతున్నారని చెప్పారు. తాకట్టు పెట్టిన తమ ట్రాక్టర్,లారీలను సంస్థ సిబ్బంది తీసుకెళ్లారని, తమ జీవనాధారమైన వాటిని విడిపించాలని, తమపై దాడికి దిగిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నాకు ప్రాణహాని ఉంది నన్ను రక్షించండి

గుంటూరు చిన్ని ట్రావెల్స్ ఓనర్ కె. నాగకుమార్ (చిన్ని) నుండి ఓ స్థల వివాదమై తనకు ప్రాణహాని ఉందని గుంటూరు నల్లచెరువు చెందిన కొరటిపాటి ప్రేమ్ శ్రీ కుమార్ సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రేమ్ శ్రీ కుమార్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం రమేష్ హాస్పిటల్ పక్కన కమలశౌరీలు అనే వ్యక్తి వద్ద నుండి 100 గజాల స్థలం లీజుకు, కొని నిర్మాణాలు చేస్తున్న సమయంలో నాగకుమార్ ఈ స్థలము తనదంటూ వచ్చాడని చెప్పారు. కమలశౌరీలు దగ్గర నుండి తాను లీజుకు తీసుకున్నానని, వారు తనకు రాసిచ్చిన డాక్యుమెంట్ చూపించానన్నారు. ఈ స్థలం విషయమై ఇద్దరం కోర్టుకు వెళ్లగా ఇంజెక్షన్ ఆర్డర్ ఇచ్చిందని, అయితే దానిని ధిక్కరించి చిన్ని ట్రావెల్స్ వాహనాలను అక్కడ పెడుతున్నారని చెప్పారు. ఈ విషయమై ప్రశ్నించగా కొంత మంది రౌడీ షీటర్లతో తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని ప్రేమ్ శ్రీకుమార్ తెలిపాడు. తనపై దౌర్జన్యానికి దిగుతున్న నాగకుమార్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తనను బెదిరిస్తున్న వారి నుండి కాపాడాలని కోరాడు.

ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న నగరంపాలెం సిఐ

కోర్టు ఆవరణలో మామపై అల్లుడు దాడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గాయపడిన గూడూరు శ్రీనివాసరావు

మామపై అల్లుడి తాళంతో దాడి చేసిన సంఘటన సోమ వారం ఉదయం 11 గంటల ప్రాంతంలో వివాదానికి దారి తీసిన విడాకుల కేసు జిల్లా కోర్టు ప్రాంగణంలో జరి గింది. పోలీసుల కథనం ప్రకారం న్యాయ స్థానం ఆవరణలో వాయిదాకు హాజరైన సమయంలో తనమామ గూడూరు శ్రీని వాస రావుపై అల్లుడు ధారా శ్రీనివాసరావు తాళంతో దాడికి పాల్పడ్డాడు. చెవిపై పొడవడంతో గూడూరు శ్రీని వాస రావు తీవ్రంగా గాయపడ్డారు.రక్తస్రావం కావడంతో పాటు తలకు కూడా ప్రభావం ఉండటంతో అతను అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయాడు. పరిసరాల వారు నిందితుడిని నగరం పాలెం పోలీసులకు అప్పగించారు. నగరంపాలెం సిఐ హైమారావు నిందితుడు ధారా శ్రీని వాసరావును అదుపు లోకి తీసుకున్నారు. గాయపడిన గూడూరు శ్రీనివాన రావును పోలీసులు ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. ఆర్మీలో పనిచేస్తున్న శ్రీని వాస రావు భార్య జోత్స్నతో వివాదం ఏర్పడింది. మరో మహిళతో వివా హేతర సంబంధం ఏర్పరచుకుని తనకు విడాకులు కావా లని వేధిస్తున్నాడని ఆమె తెలిపారు. కేసు వాయిదాకు వచ్చిన తనపైనా, తన తండ్రిపై తన భర్త దాడి చేశారని ఆరోపించారు.

జ్యుయలరీ షాపులో చోరీ

రూ.40 లక్షల ఆభరణాల అపహరణ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పట్టణంలోని నాలుగో వార్డులో ఉన్న శ్రీ వెంకటేశ్వర జ్యుయలరీ షాపులో గుర్తు తెలియని దుండగులు లోనికి ప్రవేశించి రూ.40 లక్షల విలువ చేసే బంగారు వెండి ఆభ రణాలతో పాటు నగదు అపహరించు కు పోయిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జరిగింది. పొన్నూరు అర్బన్ పోలీ సుల కథనం ప్రకారం పొన్నూరు పట్టణం నాలుగో వార్డులో శ్రీ వెంకటేశ్వర జ్యువెలరీ షాప్ వెనుక ప్రహరీ గోడ వైపు నుంచి గుర్తు తెలి యని వ్యక్తులు లోపలికి ప్రవేశించి షాపు తలుపు తాళాలను గడ్డపారతో పగల కొట్టారు. షాపులో ఉన్న రూ.11 .50 లక్షల నగదు, షో కేసులో ఉన్న 575 గ్రాముల బం గారు ఆభరణాలు, మూడు కిలోల వెండి ఆభరణాలు దోచుకుని పోయారు. జ్యువెలరీ షాప్ నిర్వాహకుడు ఆలపాటి కిషోర్ ఈ మేరకు పొన్నూరు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం మేరకు పొన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ ఎండి కాజా అల్తాఫ్ హుస్సే న్ తమ సిబ్బందితో చోరీ జరిగిన సం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం గుంటూ రు సిసిఎస్ డిఎస్పి ప్రకాష్ బాబు, తెనాలి డిఎస్పి జనార్ధన్‌రావు, వేలిముద్రల నిపుణులు పరి శీలించారు. ఈ మేరకు పొన్నూరు అర్బన్ స్టేషన్ సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో సిఐ మాట్లాడుతూ దుండగుడు తలకు పట్టా కప్పుకొని, చేతికి గ్లౌజులు తొడుక్కొని దొంగతనానికి పాల్పడ్డా డని చెప్పారు. సిసి ఫుటేజ్ ద్వారా ఈ సమా చారం లభించిందన్నారు. జ్యువెలరీ షాపు లలో సిసి కెమెరాలు లేని వారు వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు ఎవరికైనా తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 24,716
మిర్చి ఎగుమతి	: 23,897
మిర్చి నిల్వ	: 9,478

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,500 - 24,000
నెం.5	15,000 -19,700
341	12,000 - 22,500
సూపర్ 10	19,500 - 19,500
	నాన్ ఎసి
తేజ	9,000 - 23,900
బడిగి	14,000 - 26,000
దేవనూరు డీలక్స్	18,000 - 20,000
తాలుకాయలు	5,000 -14,500
	ఎసి
334	10,500 - 22,600
341	16,000 - 23,000
273	16,000 - 16,000
సూపర్ 10	18,800 - 18,800
తేజ	12,500 - 23,500
బడిగి	16,500 - 24,500
దేవనూరు డీలక్స్	17,500 - 20,000
తాలుకాయలు	5,000 -13,000

చిరు వ్యాపారికి తోపుబడి బండి అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

చిరు వ్యాపారుల జీవనోపాధి మెరుగుపరచడానికి 'కావటి సుధీర్ నాయుడు ఫౌండేషన్' కషి చేస్తుందని ఫౌండేషన్ అధ్యక్షులు, నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు అన్నారు. సోమవారం 23వ డివిజన్ నగరంపాలెంలోని 3 బొమ్మల సెంటర్ వద్ద షేక్ హుస్సేన్‌కు 'కావటి సుధీర్‌నాయుడు ఫౌండేషన్ తరపున తోపుడు బండి అందజేశారు. మేయర్ మాట్లాడుతూ రోడ్ల వెంబడి చిరు వ్యాపా రం చేసుకొనే వారు రోజువారీ అద్దేలతో బండ్లు పెట్టుకొని ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి 'కావటి సుదీర్ నాయుడు ఫౌండేషన్' ద్వారా తగిన తోడ్పాటు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సాదు ఉమామహేశ్వరి రాజేష్, వైసిపి నాయకులు కంతేటి శ్యాంశేఖర్, ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో గుర్తుతెలియని మహిళ మృతి

ప్రజాశక్తి-గుంటూరు సిటీ

గుంటూరు జనరల్ ప్రభుత్వ ఆసుపత్రి లో చేరి చికిత్సా పొందుతూ మహాలక్ష్మి (27) అనే గుర్తు తెలియని మహిళ మతి చెందినట్లు కొత్తపేట సిఐ షేక్ అన్వర్ బాషా తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 31 తేదీన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసు పత్రిలో చేరిందని, ఆ రోజే తనతో ఎవరూ లేరని, ఓపిలో అడ్రస్ గుంటూరు అని మాత్రమే రాసి ఉందన్నారు. చికిత్స పొందుతూ మహాలక్ష్మి ఈ నెల 10వ తేదీ రాత్రి మృతి చెందిందని, మృత దేహాన్ని తీసుకెళ్లేందుకు బంధువులు ఎవరూ రాకపోవ డంతో గుంటూరు జి.జి.హెచ్ శవాగారంలో ఉంచినట్లు చెప్పారు. మహా లక్ష్మి వివరాలు తెలిసిన వారు 8688831320, 8688831 609 నెంబర్లకు ఫొన్ చేసి కొత్తపేట పోలీసులను సంప్రదించాలని కోరారు.

పాస్‌పోర్టు పోయినది

Kallam Rohini, D/o Sadasiva Reddy అను నేను మాచర్లలో నివాసం వుంటున్నాను. నేను ఇంటి వద్ద నుండి బస్టాండ్ సెంటర్‌కు వెళుతున్న క్రమంలో నా పాస్‌పోర్టు నెం.**F5701004** పోయినది. పాస్‌పోర్టు కోసం ఎంత వెదికినా కనపడలేదు. ఎవరికైనా దొరికిన యెడల క్రింది చిరునామాకు తెలుపగలరు.

Address.....
Kallam Rohini,
D/o Sadasiva Reddy,
రామాటాకీస్ లైన్, మాచర్ల.
ఫోన్ : 90106 93244

PUBLIC NOTICE

On behalf of my client Indumathi W/o T.Krishnaiah, the inhabitants, 11/4, Friends Avenue, Arumbakam, Chennai-600106, State of TamilNadu. GPA holder, T.Sai Shyam Kumar, S/o T.Krishnaiah and Indumathi, the inhabitants Swagatham Apartment, 2nd Floor, 18/6 (3/6), West mada Street, Koyambedu, Chennai-600107. In the name of my client Mother Indumathi for Property, Vishwambhara Apartment, Plot No.F5 (Old 4-4-137), New 25-6-251, 6/1A, Chandramouli Nagar, Guntur-522007. On 08-10-1997 the deed was registered in SRO Guntur as a sale **deed No:7139/1997** On 04-09-2023, the cover with said document slipped and fell somewhere while travelling within Tadikonda SRO. No matter how much you enquired the document unable to find it. Therefore, if anyone finds the said deed, either I or my client will be given a suitable reward. As such, my client's mother will be liable to take legal, civil and criminal action if any illegal activities are done using the said document.

Komma Ramesh,B.A., M.L.,
Advocate,
3rd Line, Gunturivari Thota,
Guntur-522001, Cell No.9440613392.

CHANGE OF NAME

I, **PRANJAL RAKESH MALU (Old Name), S/o. RAKESH MALU,** R/o. 13-4-29, Gunturuvari Thota, 3rd Lane, Guntur, Andhra Pradesh, Pin: 522001, Changing my name from **PRANJAL RAKESH MALU (Old Name)** to **PRANJAL MALU (New Name)** hence forth be known as **PRANJAL MALU** for all purposes.

Before The 1st Addl. Motor Accident Claims Tribunal : Nellore
M.V.O.P.No. 660 / 2017

Pamidi Subhashini and others - Claimants

Versus

1. **Sk. Karimunnisa**
2. **The New India Assurance Co.Ltd.,** rep.by its D.M., Ongole
3. **V.Lakshman**
4. **M. Anand Kumar**
5. **M.Lakshmi Prasad**
6. **The Oriental Insurance Co. Ltd.,** rep.by its Branch Manager, Nellore.

- Respondents

Notice to 1st Respondent

Sk. Karimunnisa, W/o **Ibrahim,** Door No.32-659, Chilakaluripet, Guntur District.

పై నెంబరున క్లయిమెంట్స్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే15-09-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పి.శ్రీనివాసులు, ఎం.ఎ., ఎం.ఎల్., క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

సిపిఎం నాయకులు నేతాజి అక్రమ నిర్బంధం

ప్రజాశక్తి-గుంటూరు

బంద్ నేపథ్యంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారు. పోలీసులు ఉదయం ఆయనను ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని నల్లపాడు పోలీసు స్టేషన్‌లో ఉంచారు. బంద్‌తో తమకు సంబంధం లేదని చెప్పినా పోలీసులు వినలేదు. తన కుమార్తెను హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని చెప్పినా వినకుండా సిఐతో ఒక ఫొటో తీయించుకొని పంపిస్తామని, రెండు వాహనాల్లో మార్చుకుంటూ స్టేషన్‌కు తీసుకెళ్లారు. సిఐ స్టేషన్‌లో లేకపోవటంతో ఆయనను 11.30 వరకూ స్టేషన్‌లోనే ఉంచారు. ఆ తర్వాత విడుదల చేశారు. పోలీసు వ్యవహార శైలి ప్రజాస్వామ్య విరుద్ధమని నేతాజి అన్నారు.

పొన్నూరులో ఎస్పీ పరిశీలన

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు రిమాండ్ నేపథ్యంలో జిల్లాలో పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 30 ఏ.పి పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. సోమవారం పొన్నూరు పట్టణంలో శాంతి భద్రతలను పరిశీలించిన ఆయన జిల్లాలో ఎక్కడా నిరసనలకు, ధర్నాలకు అనుమతి లేదని చెప్పారు. ప్రజల సాధారణ జీవనం, రాకపోకలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్ల పైకి వస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట తెనాలి డీఎస్పీ జనార్ధన్‌రావు, పొన్నూరు అర్బన్ సిఐ ఎమ్‌డి కాజా అల్తాఫ్ హుస్సేన్, రూరల్ ఎస్సై భార్గవ్ పాల్గొన్నారు.

కక్షసాధింపే.. అరెస్టు సరైందే..

ప్రజాశక్తి - వినుకొండ

జగన్ మోహన్‌రెడ్డి అవినీతి, దోపిడీని ప్రశ్నించినందుకే చంద్రబాబు నాయుడుపై తప్పుడు కేసు పెట్టి అక్రమంగా అరెస్టు చేశారని టిడిపి పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు విమర్శించారు. ఈ మేరకు టిడిపి కార్యాలయంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అయితే చట్టం ముందు అందరూ సమానమేనని, చంద్రబాబు నాయడు జైలుకు వెళ్లడం తప్పేమీ కాదని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్థానిక వైసిపికార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ అన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

చంద్రబాబునాయుడుకు ఎసిబి కోర్టు రిమాండ్ విధించటాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ కేసు పూర్తి విచారణ జరిగితే చంద్రబాబుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష పడొచ్చన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఇదిలా ఉండగా మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేటలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టు వేనుక భారీ కుట్రం ఉందని ఆరోపించారు.ఆర్థికశాఖ ఉన్నతాధికారిగా పనిచేసిన పీవీ రమేశ్ వ్యాఖ్యాలను వక్రీకరించాని మండిపడ్డారు.

దుగ్గిరాల

పిడుగురాళ్ల

నిరసనలు.. అరెస్టులు..

- చంద్రబాబు అరెస్టుకు నిరసనగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో బంద్ పాటించిన టిడిపి
- జనసేన, సిపిఐ మద్దతు
- ఎక్కడికక్కడ అరెస్టులకు పూనుకున్న పోలీసులు

ప్రజాశక్తి - గుంటూరు, పల్నాడు జిల్లాల విలేకర్లు

టిడిపి అధినేత అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపు నిచ్చిన నేపథ్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో బంద్ జరిగింది. కొన్ని సంస్థలు, దుకాణాలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. టిడిపి శ్రేణులు పలుచోట్ల నిరసన ప్రదర్శనలు, రాస్తారోకోలు చేశారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదాలు తలెత్తగా టిడిపితోపాటు జనసేన నాయకుల్ని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. మరోవైపు ముఖ్య నాయకులను పోలీసులు ముందుగానే గృహ నిర్బంధంలో ఉంచడం, అదుపులోకి తీసుకోవడం వంటివి చేశారు. అయితే సత్తెనపల్లి, మాచర్ల, రెంటచింతల తదితర ప్రాంతాల్లో బంద్ ప్రభావం కనిపించలేదు.

బంద్‌లో భాగంగా **గుంటూరు** నగరంలోని పాఠశాలలు, కాలేజీలు, ఇంజినీరింగ్ కాలేజీలు మూతపడ్డాయి. అనేక ప్రైవేటు పాఠశాలలు, ఇంజినీరింగ్ కాలేజిలు ముందుగానే సెలవు ప్రకటించాయి. టిడిపి శ్రేణులు ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థల వద్దకు వెళ్లి సోమవారం తరగతులు నిలిపేశారు. దీంతో పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. బంద్‌తోపాటు ఉదయం వర్షం కురుస్తుండటంతో పాఠశాలలపై ప్రభావం పడింది. **తాడేపల్లి** పట్టణంలో టిడిపి శ్రేణులు అన్ని కార్యాలయాలు, సంస్థలనూ మూసివేయించి ఉండవల్లి సెంటర్‌లో రాస్తారోకో చేయడంతో విరమించాలని పట్టణ సిఐ శేషగిరిరావు కోరారు. అందుకు టిడిపి కార్యకర్తలు నిరాకరించడంతో వాగ్వాదం తలెత్తింది. పలువర్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. నెహ్రుబొమ్మ సెంటర్‌లో దుకాణాలు మూయించే క్రమంలో పోలీసులు అడ్డుకోగా వాగ్వాదం జరిగింది. మరికొందర్ని అరెస్టు చేశారు. పెనుమాకలో కె.శేషు ఆధ్వర్యంలో బంద్ చేశారు. ఉండవల్లి సెంటర్‌లో సిఎం జగన్ దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు మహిళలు గాయపడ్డారు. **తాడేపల్లి రూరల్** మెల్లంపూడిలో ప్రధాన రహదారిపై సిఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కుంచనపల్లిలో టిడిపి, జనసేన నాయకులు బంద్ నిర్వహించారు. ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తుండగా పోలీసులు కొందర్ని స్టేషన్‌కు తరలించారు. రాజధాని ప్రాంతం **తుళ్లూరు**లో టిడిపి, జనసేన శ్రేణులు నిరసన ప్రదర్శన చేశారు. తాడేపల్లి నుంచి తుళ్లూరు వస్తున్న టిడిపి జిల్లా కార్యదర్శి తెనాలి శ్రావణ్ కుమార్‌ను పోలీసులు రాయపూడిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు వద్ద అడ్డుకున్నారు. పోలీస్ జీపు ఎక్కాలని కోరగా ఇందుకు కార్యకర్తలు, నాయకులు అభ్యంతరం చెప్పడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. శ్రావణ్‌కుమార్ తుళ్లూరు చేరుకొని నల్లజెండాలతో చేపల్లిన ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక రైతు దీక్షా శిబిరంలో శ్రావణ్ కుమార్‌తోపాటు జనసేన మండల అధ్యక్షులు యెర్రగోపు నాగరాజు మాట్లాడారు. **మంగళగిరి**లోని పలు సెంటర్లో టిడిపి, జనసేన, ఎంఆర్‌పిఎస్, సిపిఐ ఆధ్వర్యంలో ర్యాలీలు చేశారు. పాత టైర్లు, సిఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. కొంతమందిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, మరికొంతమంది నాయకులను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. **మంగళగిరి రూరల్** మండలంలోని పలుచోట్ల టైర్లు దహనం చేసి బంద్ పాటించారు. బంద్‌కు జనసేన, సిపిఐ, ఎంఆర్‌పిఎస్ మద్దతు తెలిపాయి. పలువురు టిడిపి నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. బంద్ చేస్తుండగా మరికొందర్ని అరెస్టు చేశారు. **దుగ్గిరాల** మండల వ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా ముగిసింది. వ్యవసాయం మార్కెటింగ్ యార్డులో క్రయ విక్రయాలు జరగలేదు. కొందర్ని పోలీసులు ఉదయం నుండే గృహనిర్బంధంలో ఉంచారు. మరి కొంతమందిని స్టేషన్‌కు తరలించారు. టిడిపి శ్రేణులు భారీ ర్యాలీ చేసి పాఠశాలలు, కార్యాలయాలను మూయించారు. తెనాలి - విజయవాడ రహదారిపై కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. **పెదకాకాని** సెంటర్లో నిరసన తెలిపారు. దుకాణాలు, కార్యాలయాలు మూసేయించారు. బంద్‌కు జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. **తెనాలి** పట్టణంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. టిడిపి, జనసేన శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి బ్యాంకులు, షాపులను మూయించారు. సిఎం జగన్ దిష్టిబొమ్మలను గాంధీ చౌక్ కూడలిలో దహనం చేశారు. ఇదిలా ఉండగా జనసేన కార్యాలయంలో ఉన్న నాయకులను వెళ్లిపోవాలంటూ పోలీసులు దుర్భాషలాడారని ఆ పార్టీ జిల్లా నాయకులు కృష్ణమోహన్ విమర్శించారు. **ప్రత్తిపాడు**లో టిడిపి నాయకులను ముందుస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మిగతావారు ఒక్కసారిగా పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని నాయకులను అరెస్టు చేయగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పలువుర్ని అరెస్టు చేసి నల్లపాడు రూరల్ స్టేషన్‌కు తరలించారు. ముందస్తు అరెస్టయిన వారిని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.రామాంజ నేయులు పరామర్శించారు. **కాకుమాను** మండలం గార్లపాడులో సర్పంచ్ సురేష్ అధ్వర్యంలో సచివాలయాన్ని మూసేశారు. కొమ్మూరులో ప్రధాన రహదారిపై బైటాయించారు. **పెదనందిపాడు**లో బంద్ ప్రశాంతంగా ముగిసింది. కొంతమంది రహదారిపై ఆందోళన చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. **చేబ్రోలు** మండల వ్యాప్తంగా పాఠశాలలు మూతబడ్డాయి. వడ్లమూడి అడ్డరోడ్డు వద్ద, నారాకోడూరు సెంటర్లో, శేకూరులో టిడిపి శ్రేణులు రాస్తారోకో చేశారు. వడ్లమూడిలో మహిళలు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. చేబ్రోలు కొమ్మమూరు కాల్వ వద్ద నిరసన తెలుపుతుండగా అదే సమయానికి అటుగా వస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వాహనాన్ని టిడిపి శ్రేణులు అడ్డగించారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. **పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో** కార్పొరేట్ విద్యాసంస్థలు, జెడ్‌పి పాఠశాలలు, దుకాణాలు మూతబడ్డాయి. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయలు, ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మరికొందరు నాయకులు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు ఉదయాన్నే వెళ్లగా పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అన్నవరం, గోగులపాడు, సుబ్బయ్యపాలెం, యలమంద తదితర గ్రామాల్లో టిడిపి శ్రేణులు రాస్తారోకో చేశారు. వినుకొండ రోడ్డులోని జనసేన నియోజకవర్గ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సయ్యద్ జిలాని, మరికొందర్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. వీరిని రాత్రి 7 గంటల తర్వాత విడుదల చేశారు. **వినుకొండ** పట్టణం కొత్తపేటలోని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులును ఆయన నివాసంలో నిర్బంధించేందుకు పోలీసులు భారీగా ముట్టడించారు. అయితే టిడిపి శ్రేణులు వారిని ప్రతిఘటించడంతో వాగ్వాదం తలెత్తింది. టిడిపి బంద్‌కు జనసేన, సిపిఐ మద్దతు తెలిపాయి. ఆర్టీసీ బస్టాండ్ వద్దకు టిడిపి శ్రేణులు బంద్ పాటిస్తుండగా పట్టణ సిఐ సాంబశివరావు ఆధ్వర్యంలో పోలీసులు వారిని స్టేషన్ తరలించారు. పట్టణంలో కొన్ని సంస్థలు, దుకాణాలు స్వచ్ఛంద బంద్ పాటించగా మిగతావాటిని మూడు పార్టీల శ్రేణులు బైక్‌ర్యాలీ చేసి మూసేయించాయి. శివయ్య స్తూపం సెంటర్ వద్ద ఆందోళన చేశారు. అందోళనకారులను అడ్డుకునే క్రమంలో పోలీసులు లాఠీఛార్జీ చేసి నాయకులను అరెస్టు చేశారు. వీరంతా స్టేషన్ గేటు వెలుపల నిరసన తెలిపారు. ఇదిలా ఉండగా నరసరావుపేట రోడ్డులోని చెక్క వాగు, చీకటిగలపాలెం బ్రిడ్జిల వద్ద టైర్లు కాల్చి రోడ్డుకు అడ్డంగా వేసి రాకపోకలను అడ్డుకున్నారు. **యడ్లపాడు**లో టిడిపి నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేశారు. ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా మూసివేశారు. **సత్తెనపల్లి**లోని తాలూకా కోర్టు బయట టిడిపి లీగల్ సెల్ న్యాయవాదులు నిరసన తెలిపారు. బంద్ నేపథ్యంలో పట్టణంలో పోలీసులు భారీగా మోహరించారు. 20 మంది వరకు నాయకులన్ని ముందస్తు అరెస్టు, గృహ నిర్బంధంలో ఉంచారు. దీంతో పట్టణంపై బంద్ ప్రభావం పడలేదు ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. పాఠశాలలు, కార్యాలయాలు పనిచేశాయి. ఇదిలా ఉండగా అరెస్టులను సిపిఎం ఖండించింది. అరెస్టయిన వారిని స్టేషన్‌లో సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు జి.మల్లీశ్వరి, ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, నాయకులు కె.శివదుర్గా రావు, ఎ.వీరబ్రహ్మం, ఆర్.పురుషోత్తం, కె.సాయికుమార్ పరామర్శించారు. **మాచర్ల**లోనూ బంద్ ప్రభావం కనిపించ లేదు. కొందరు టిడిపి నాయకులను పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. **రెంటచింతల**లో పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో బంద్ ప్రభావం కనిపించలేదు. పాఠశాలలు, కళాశాలలు, వ్యాపారాలు, బ్యాంకులు, పోస్ట్ ఆఫీస్‌లు కొనసాగాయి. **ముప్పాళ్ల**లోని నర్సారావు పేట- సత్తెనపల్లి ప్రధాన రహదారిపై జిబిసి కెనాల్‌పై బైటాయించారు. కొందర్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. **పిడుగురాళ్ల**లో బంద్ పాక్షికంగా జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి, జనసేన నాయకులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న సెల్‌టవర్‌ను టిడిపి కార్యకర్త జి.కరుణాకర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని నిరసన తెలపగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్టాండ్ సమీపంలో జనసేన నాయకులు నిరసన తెలుపు తుండగా పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. కొందరు మహిళా నాయకులు జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బ్రాహ్మణపల్లిలో అద్దంకి - నార్కెట్‌పల్లి రహధారిపై టిడిపి శ్రేణులు బైటాయిం చాయి. **పెదకూరపాడు**లో బ్యాంకులు, పాఠశాలలను మూసేశారు. కొన్ని దుకాణాలు, సంస్థలు స్వచ్ఛందగా బంద్ పాటించాయి. టిడిపి శ్రేణులు ప్రదర్శన చేశాయి. కొందర్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. మండల అధ్యక్షులు రమేష్, మరికొందర్ని పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌ను గుంటూరు లోని ఆయన నివాసంలో పోలీసులు ముందు గానే గృహ నిర్బంధం లో ఉంచారు. **నాదెండ్ల** మండలంలో పలు గ్రామాల్లో బంద్ పాటించారు. పలువుర్ని పోలీసులు అరెస్టు చేశారు.

సత్తెనపల్లి

చేబ్రోలు

ఐలమ్మ ఆశయ సాధనకు పునరంకితమై పనిచేస్తాం

ఎపి రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

నిజాం నిరంకుశ పాలనలో బానిసత్వానికి వ్యతిరేకంగా తెలంగాణాలో జరిగిన సాయుధ పోరాటంలో ఐలమ్మ ముందుభాగాన నిలిచిపోరాడిన వీర వనిత అని, ఐలమ్మ ఆశయాల సాధన కోసం పునరంకితమై పనిచేస్తామని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య అన్నారు. సోమవారం ఎంటిఎంసి పరిధిలోని ఇప్పటం గ్రామంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి కళ్యాణ మండపం వద్ద ఐలమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి ఆయన పూలమాలవేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భాస్కరయ్య మాట్లాడుతూ ఇప్పటం గ్రామంలో గ్రామ పెద్దలు మున్నంగి వివేకానంద రెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేయబడిన ఐలమ్మ విగ్రహం స్ఫూర్తిదాయకం కలిగించిందన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, తాడేపల్లి మండలం రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్నంగి వివేకానంద రెడ్డి మాట్లాడుతూ ఇప్పటం గ్రామంలో ఇంత చరిత్ర కలిగిన వీరనారి ఐలమ్మ గారి విగ్రహం ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించిన గ్రామ రజక సంఘం నాయకులకు, కార్యకర్తలకు, జిల్లా రాష్ట్ర నాయకత్వానికి అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా అమర జీవులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి ఇప్పటం గ్రామంలో ఉన్న శివాలయం దేవస్థానం ధర్మకర్త లచ్చి వెంకటేశ్వరరావు, వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మున్నంగి వివేకానంద రెడ్డి, వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి గాజుల పిచ్చయ్య, వీరనారి ఐలమ్మ విగ్రహానికి వల్లభాపురం వెంకటేశ్వరరావు పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇప్పటం గ్రామ రజక వత్తిదారుల సంఘం అధ్యక్ష- కార్యదర్శులు పిన్నేపల్లి లక్ష్మీనారాయణ , నాగేశ్వరరావు ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు పరిశీలన ఫారాలను ఆన్‌లైన్ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల పరిధిలో బిఎల్ఓలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసిన ఫారాలను రెండ్రోజుల్లో ఆన్‌లైన్ చేయాలని, సూపర్‌వైజరీ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో ఏఈఆర్ఓలు, పర్యవేక్షణ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.కమిషనర్ మాట్లాడుతూ వెరిఫికేషన్ పూర్తి చేసిన ఫారాలు ఆన్‌లైన్ చేయడానికి జిఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను కేటాయించామన్నారు. సూపర్వైజరీ అధికారులు ఫారాలు ఆన్ లైన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పరిశీలించి, ఎక్కడైనా కేంద్రాలు మార్పులు ఉంటే తెలియజేయాలన్నారు. అలాగే ఎన్నికల విధులు కేటాయించబడిన సిబ్బంది ఎన్నికల సంఘం నుండి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ఏదైనా కారణంతో సెలవులో ఉంటే ఫోన్‌లో అందుబాటులో ఉండాలని తెలియజేశారు.

అనంతరం పారిశుధ్య పనుల పై సమీక్షించారు. ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగేలా పర్యవేక్షణ చేయాలని ఎంహెచ్ఓని, చెత్త తరలింపు వాహనాలు షెడ్యూల్ మేరకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ నెల 15లోపు జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతి వాలంటీర్ తమ పరిధిలోని ఇళ్లల్లో ప్రజల ఆరోగ్య సమస్యలపై సర్వే నిర్వహించి ఏఎన్ఎంకు ఇవ్వాలన్నారు. ఏఎన్ఎం 15 తర్వాత అవసరమైన వారికి ప్రాధమిక పరీక్షలు చేసి, తదుపరి జరిగే మెడికల్ క్యాంప్ లకు తీసుకువస్తుందన్నారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, సూపర్వైజరి అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్

గుంటూరు మేయర్ వివాదాస్పద వ్యాఖ్యలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పవన్ కల్యాణ్‌పై గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుకు పవన్ కల్యాణ్ పుట్టారా? తాను పుట్టలేదా అని లోకేష్‌కు అనుమానం వచ్చేలా ఉందని మేయర్ వ్యాఖ్యానించారు. కాపుజాతిని పవన్ కల్యాణ్ చంద్రబాబు వద్ద తాకట్టుపెట్టాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు కోసం లోకేష్ బైఠాయిస్తే పవన్ కల్యాణ్ ఏకంగా రోడ్డుమీద పొడుకున్నారని ఎద్దేవా చేశారు. కాపులను అడ్డుపెట్టుకుని చంద్రబాబుకు ఊడిగం చేయడానికి కుదరదు... రంగాను చంపింది, ముద్రగడను కొట్టించింది చంద్రబాబునేనని మేయర్ వ్యాఖ్యానించారు.

మేయర్ క్షమాపణ చెప్పాలి : జనసేన

మేయర్ కావటి మనోహర్ నాయుడు పవన్ కల్యాణ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై వెంటనే కాపులకు, ప్రజలకు క్షమాపణ చెప్పకపోతే మేయర్‌ను గుంటూరులో తిరగనివ్వబోమని జనసేన జిల్లా నాయకులు గాదె వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం ఉదయం లోగా మేయర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని గాదె హెచ్చరించారు. మేయర్ తన రెండున్నరేళ్ల పదవి కాలం పూర్తి కావడంతో అధిష్టానం మెప్పు కోసం ఇలా మాట్లాడుతున్నాడని భావిస్తున్నట్లు జనసేన నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ వ్యాఖ్యానించాడు.

కావటి, మద్దాళిపై కోవెలమూడి ధ్వజం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ సోమవారం జరిగిన బంద్‌లో గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాలి గిరి దౌర్జన్యం చేయటంపై పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ కోవెలమూడి రవీంద్ర(నానీ) తప్పుపట్టారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా తమ పార్టీ బంద్‌కు పిలుపునిస్తే స్థానిక పోలీసులు తన ఇంటిని చుట్టుముట్టి స్థానిక సిఐ తనకు నోటీసులు అందజేశారని, ఇందులో 144 సెక్షన్ అమల్లో ఉందని ఆందోళనకు అనుమతి లేదన్నారని తెలిపారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు తన అనుచరులతో పోలీస్ లాఠీలను చేతబట్టి, నడి సెంటర్లో హడావుడి చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం ఏమిటి ? పోలీసు లాఠీని చేతుల పట్టుకొని, అరండల్ పేట పోలీస్ స్టేషన్ ఎదురు అడ్డగోలుగా దౌర్జన్యం చేస్తుంటే ఈ పోలీస్ వ్యవస్థ ఏమైపోయిందన్నారు. చట్టాన్ని మేయర్ చేతుల్లోకి తీసుకుంటే పోలీసులు పట్టనట్లు ఉన్నారని విమర్శించారు.

మీ 144 సెక్షన్ ఏమి అయిపోయిందన్నారు. అంటే 144 సెక్షన్ ప్రతిపక్షాలకేనా ? పోలీసు వ్యవస్థ నిష్పక్షపాతకంగా వ్యవహరించాల్సింది పోయి అధికార పక్షానికి గులాంగిరి చేస్తుందన్నారు. అడ్డగోలుగా దౌర్జన్యానికి పాల్పడ్డ మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాలి గిరి పై వెంటనే కేసులు నమోదు చేసి పోలీసులు తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. మద్దాలిగిరికి 2014లో తెలుగుదేశం పార్టీ టికెట్ ఇస్తే గెలవలేదు, మరలా 2019లో గుంటూరు పశ్చిమ నుండి అనేకమంది నాయకులు కార్యకర్తలు కష్టపడి గెలిపిస్తే, నేడు చంద్రబాబు మీద అవాకులు, చవాకులు పేలుతున్నావ్, ఖబర్దార్ మద్దాలి గిరి, నువ్వు చంద్రబాబుని నోటికి వచ్చినట్లు మాట్లాడితే, మీ ఇంటినీ ముట్టడిస్తాము. నువ్వు పిచ్చి పిచ్చిప్రేలాపనలు మానుకొని ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని నైతికత ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. మేయర్ మనోహర్ నాయుడు కార్పొరేషన్ ను అడ్డుపెట్టుకొని భారీగా అవినీతికి పాల్పడుతున్నాడని చెప్పారు. గత ఏడాది ఆగస్టు 31వ తేదీన మద్దాలిగిరికి ప్రభుత్వం నుండి సబ్సిడీ రూపంలో 9 కోట్లు అందిన మాట వాస్తవం కాదా ? మేయర్ అవినీతికి పాల్పడ్డారని సొంత పార్టీ కార్పొరేటర్లు ఫిర్యాదు చేసిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు.పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత కావటికి లేదన్నారు.

మాట్లాడుతున్న కోవెలమూడి రవీంద్ర

కమిషనర్‌కు బొకే అందచేస్తున్న ముత్యాలరావు, తదితరులు

నగర కమిషనర్‌కు సిఐటియు అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరం 3వ ర్యాంకు సాధించిన సందర్భంగా ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) నాయకులు గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి పూలబొకే అందచేశారు. భవిష్యత్‌లో జిఎంసి మరింత అభివృద్ధి సాధించాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు ఆకాక్షించారు. అలాగే జిఎంసి పరిధిలోని వివిధ శానిటేషన్ డివిజన్లలో పనిచేస్తు బదిలీ కార్మికులకు నెలలో 10..., 15 రోజులు మాత్రమే పని ఉంటుందని, వీరిని పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వినియోగించి, ఉపాధి కల్పించాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉన్న డివిజన్లలో బదిలీ కార్మికులను అడ్జస్ట్ చేయాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో డి.దుర్గ, బత్తుల లక్ష్మి, బుజ్జి, చల్లా దుర్గ తదితరులున్నారు.

కమిషనర్‌కు బొకే అందచేస్తున్న అదనపు కమిషనర్ తదితరులు

జిఎంసి సిబ్బంది అభినందన : నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతోనే గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్ వచ్చిన సందర్భంగా నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో కమిషనర్‌ను జిఎంసి అధికారులు, సిబ్బంది అభినందించారు. కమిషనర్‌ను అభినందించిన వారిలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్‌భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సునీతను సన్మానిస్తున్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, లక్ష్మీ అన్నపూర్ణమ్మ తదితరులు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు

కొత్త సునీతకు బొమ్మిడాల ఫౌండేషన్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

తమ తండ్రి బొమ్మిడాల కోటిరత్నం పేరున ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా పనిస్తూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కొత్త సునీతను బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బొమ్మిడాల శ్రీకష్ణమూర్తి అభినందించారు. సోమవారం స్థానిక రింగురోడ్డులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొత్త సునీత రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకోవటం ద్వారా పాఠశాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేసిందని అన్నారు. కార్యక్రంలో బొమ్మిడాల శ్రీకష్ణమూర్తి, లక్ష్మీఅన్నపూర్ణమ్మ దంపతులు, పెండ్యాల ప్రతీష, అడపాల మురళీధర్, పాఠశాల హెచ్ఎం డి.వెంకటరావు, ఉపాధ్యాయులు మన్నవ సురేష్, జక్రియ అహ్మద్, కోట మురళీకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధ హమాలీకి సిఐ సాయం

ప్రజాశక్తి-మాచర్ల

వృద్ధ హమాలీ ఒకరు పార్శిల్ ఆఫీసు నుండి నెట్టుడుబండిపై సరుకు తీసుకొస్తున్న సమయంలో గోతిలో టైరు పడి అదుపు తప్పి అందులోని సామాన్లు కిందపడిపోయాయి. వర్షపు నీరు నిలబడి ఉండటంతో రహదారిపై ఉన్న గుంత ఆ కూలికి కనిపించలేదు. బండిపై నుండి సామాన్లు కిందపడి పోవడంతో వాటిని బండిపైకి చేర్చేందుకు కష్టపడుతుండగా, అదే సమయంలో అటుగా వస్తున్న పట్టణ సిఐ బాలకృష్ణ, ఎస్.ఐ సుందర్‌రాజన్‌లు గమనించారు. వారి వాహ నాన్ని ఆపి కిందకు దిగి ఆ హమాలీకి సాయం పట్టారు. సరుకులను బండిపైకి చేర్చారు. సిఐ చేసిన సాయానికి ముఠా కూలీలు తమ కృతజ్ఞతలు తెలిపారు.

గుజ్జనగుండ్ల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నిమ్మల శేషయ్య తదితరులు

టిడిపి,జనసేన నేతల అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా బంద్ నిర్వహణలో భాగంగా సోమవారం గుంటూరులోని వేర్వేరు ప్రాంతాల్లో టిడిపి,జనసేననేతలను పోలీసులు అరెస్టు చేశారు. టిడిపి నాయకులు నిమ్మల శేషయ్య ఆధ్వర్యంలో పలువురునేతలు, కార్యకర్తలు స్థానిక గుజ్జనగుండ్లలో నిరసన వ్యక్తం చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పట్టాభిపురం పోలీసు స్టేషన్‌కు తరలించారు.వీరితో పాటు వేర్వేరు గార్డెన్స్ ప్రాంతంలో టిడిపి నాయకులు హనుమంత రావు, లాల్ వజీర్ తదితర నేతలను అరెస్టు చేశారు. అలాగే లాడ్జి సెంటర్‌లో ఆందోళన చేస్తున్న జనసేన నేతలు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాసయాదవ్, నేరెళ్ల సురేష్, ఉప్పురత్తయ్య,ఆళ్ల హరి తదితరులను అరెస్టు చేసి అరండల్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు.

నేడు.. 'పాడుదాం రండి'

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

సినీకవి ఆత్రేయ, సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్. సుబ్బలక్ష్మీ జయంతులను పురస్కరించుకుని పాటల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెల ఔత్సాహిక గాయనీ గాయకుల కోసం నిర్వహించే మనమూ పాడదాం!రండి! కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు అవగాహన కార్యాలయంలో ఈ వారం సినీ కవి ఆత్రేయ వర్ధంతి, సంగీత విద్వాంసురాలు ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి జయంతులను పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆసక్తి కల వారుహాజరు కావచ్చునని తెలిపారు.

ప్రకృతిని, అడవులను సంరక్షిద్దాం: కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రకృతి, అడవులు సంరక్షణ ప్రతి ఒక్కరి జీవిత లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పల్నాడు జిల్లా మండల కేంద్రం కారంపూడి గ్రామానికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) రచించిన 'ప్రకృతి,అడవుల సంరక్షణ అందరి బాధ్యత' పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశంలో ఉన్న 33 శాతం అడవులు వృద్ధి చేసుకోవడం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ ఏడాది తలపెట్టిన కార్యక్రమం విజయవంతం చేసిన కోటి విత్తన బంతులు కార్యక్రమం, అలాగే తాను పక్షుల కోసం వేస్తున్న పంట, ప్రకృతి ఔషధ మొక్కలు గురించి కొమెర అంకారావు కు ఉన్న అపార అనుభవం తనను ఆశ్చర్యపరచిందని అన్నారు. కొమెర అంకారావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో అడవులు, నదులు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సహకరించాలని, అడవి చుట్టూ పక్కన ఉన్న పొలాలలో ఇప్పుడు ప్రకతి వ్యవసాయం ప్రచారం చేసి, అడవిలోని వణ్య ప్రాణులు ఉనికిని కాపాడాలన్నారు. ప్లాస్టిక్‌ను స్వచ్ఛందంగా వాడటం ఆపివేయడం, చెట్లు నరకకుండా కాపాడటం, ప్రకృతి, వన్య ప్రాణులు సంరక్షణ, హరిత భారతదేశం కోసం ప్రతిఒక్కరూ ఈ ఉద్యమంలో పాలుపంచుకోవాలని కోరారు.

'ప్రకృతి,అడవుల సంరక్షణ అందరి బాధ్యత' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్ తదితరులు

రహదారుల నిర్మాణపనులు త్వరలో ప్రారంభిస్తాం

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలో ఆర్ అండ్ బి రహదారుల నిర్మాణానికి రూ.5 కోట్ల 15 లక్షల విడుదలయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం కాబోతున్నాయని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రెంటచింతలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తుమ్మరకోట నుంచి జమ్మలమడగ వరకు ఐదు కిలోమీటర్ల గాను రూ.3 కోట్ల 29 లక్షలు, రెంటాల నుండి మాడుగుల వరకు 2.8 కిలోమీటర్లు గాను ఒక కోటి 86 లక్షల 60 వేల రూపాయలు విడుదలయ్యాయని ,త్వరలో పనులు ప్రారంభంకానున్నట్లు చెప్పారు. అలాగే, రెంటచింతలలోని నేర్నా వాగుపై రూ.10 లక్షలతో 20 మీటర్ల పొడవు, వెడల్పుతో రెండు కానాలతో బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని అన్నారు.

ఈ బ్రిడ్జి నిర్మాణంతో అన్నదాతలు తమ పంట ఉత్పత్తులను ఇళ్లకు సులభంగా తీసుకెళ్లవచ్చని అన్నారు. సమావేశంలో సర్పంచ్ పి.పుష్పవతి రామయ్య,ఎంపిపి డి.చౌడేశ్వరి, జిడిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ ఎం.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రెంటచింతలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల పరిసర ప్రాంతాల్లో భారీవర్షం

90.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి -మాచర్ల

మాచర్ల పరిసర ప్రాంతాలలో ఆదివారం అర్ధరాత్రి నుండి సోమవారం ఉదయం వరకు ఒక మోస్తారు నుండి భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలన్ని జలమయం అయినాయి. పలు చోట్ల రోడ్లపై నుండి వర్షపు నీరు ప్రవహించింది. కుంటలు, గుంతలు నీటితో నిండిపోయాయి. సెప్టెంబర్ ప్రారంభం నుండి ఇప్పటి వరకు పడుతున్న వర్షాల వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఏప్రియల్ నెల వేసవిలో ముందుస్తుగా పత్తి వేసుకున్న వారికి మాత్రం ఈ వర్షాల వలన తీవ్ర నష్టం వాటిల్లుతుంది. చాల మంది రైతులు బోర్ల క్రింద ముందుగానే పత్తి వేసుకున్నారు. అదునులో పడకుండా, అదును తప్పి పడుతున్న వర్షాల వలన వారికి నష్టం జరిగింది. మిరప , కంది తదితర పంటలు వేసుకున్న వారికి మాత్రం ఎంతో మేలు చేస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఆదివారం రాత్రి 90.2 మిల్లీమీటర్ల కురిసినట్లు అధికారులు తెలిపారు. మరో రెండు మార్లు వరసగా ఇదే వర్షపాతంతో ఈ ప్రాంతంలో వర్షం పడితే చంద్రవంక నది పొంగి రహదార్లుపైకి వస్తుంది.

రెంటచింతలలో 22 మి.మి వర్షపాతం

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి నుండి సోమవారం ఉదయం వరకు 22 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు గణాంక అధికారి ఈశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ నెలలో సాధారణ వర్షపాతం 136 మిల్లీమీటర్ల కాగా ఇప్పటికే 206 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని ఆయన తెలిపారు.

'మిషన్ ఇంద్రధనస్సు'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదే శాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నుండి రెండవ విడత మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం సోమవారం నుండి 16 వరకు జరుగుతుందని పల్నాడు జిల్లాలో మిషన్ ఇంద్రధనస్సు విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు అన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడి డాక్టర్ అర్జునరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి

ఈ సందర్భంగా డాక్టర్ అర్జునరావు మాట్లాడుతూ అన్ని శాఖల భాగస్వామ్యంతో కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. మిషన్ ఇంద్రధనస్సు సంబం ధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అందు బాటులో ఉన్న అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలను లబ్ధి దారులకు అందించాలన్నారు. పల్నాడు జిల్లాలో 648 మంది గర్భి ణులు, 2478 మంది 5 ఏళ్ళ లోపు 100 శాతం వ్యాక్సిన్ ప్రక్రియ లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ద్వారా టీకాలు ఇప్పించి తద్వారా వారిని ప్రాణాంతక వ్యాధుల నుండి కాపాడాలని సిబ్బందికి సూచించారు. జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి డాక్టర్ బి గీతాంజలి, జిల్లా మాతా శిశు విభాగ అధికారి డాక్టర్ నాగ పద్మజ పాల్గొన్నారు.

తుళ్లూరు రైతు దీక్షా శిబిరం వద్ద కొవ్వొత్తులతో రైతులు, మహిళల నిరసన

కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు: అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి స్థానిక రైతు దీక్షా శిబి రం వద్ద రైతులు, మహిళలు కొవ్వొత్తులు వెలిగించారు.అమరావతి రాజధానికి అండగా నిలిచేవారిపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని రైతులు, మహిళలు మండిపడ్డారు. చంద్ర బాబును ఇబ్బందులకు గురిచేయడం అందులో భాగమేనన్నారు.జగన్ మోహన్ రెడ్డిది అరాచక,ప్రజాకంటక పాలనని అన్నారు.చంద్ర బాబుకు సంఘీభావం తెలుపుతున్నా మన్నారు.వెంకటపాలెం లోనూ అమరావతి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఏకైక రాజధాని గా అమరావతిని కొనసాగించాలని రైతులు, మహిళలు, రైతు కూలీలు చేస్తున్న దీక్షలు సోమవారంతో 1364 వ రోజుకు చేరాయి.మందడం దీక్షా శిబిరం వద్ద చంద్రబాబుకు సంఘీభావంగా రోడ్డు పై కి వచ్చిన కొంతమంది రైతులను పోలీసులు అదుపులోకి తీసుకొని తాడేపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు.కొన్ని గంటల తరువాత విడిచిపెట్టారు.

వర్షమొస్తే మునివేళ్ల మీదే..!

- తాత్కాలిక ఇళ్ల స్థలాల్లో ఉంటున్న పుష్కరకాలనీ బాధితుల ఆవేదన
- ఎమ్మెల రామయ్య కాలనీలో వర్షపునీరు, బురదమయం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని బోటు యార్డు వద్ద పుష్కర కాలనీ బాధితులకు తాత్కాలికంగా ఇచ్చిన స్థలాల్లో ఉంటున్న పేదలు వర్షం వస్తే రాత్రంతా మునివేళ్ల మీద నిలబడి నిద్రాహారాలకు దూరం అవుతున్నారు. ఈ పరిస్థితి పగ వాడికి కూడా రాకూడదని కోరుకుంటున్నారు. ఆదివారం రాత్రి 7 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వల్ల బోటు యార్డు వద్ద ఉన్న పేదల ఇళ్లతో పాటు నులకపేటలోని ఎమ్మెల రామయ్య కాలనీలోని పేదల ఇళ్ల ముందుకు వర్షం నీరు వచ్చి చేరింది. దీంతో పేదల బాధలు వర్ణణాతీతం. సరైన రోడ్ల సౌకర్యం లేకపోవడంతో కాలు తీసి కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. అంతా బురద, ఎక్కడి నుంచో కొట్టుకు వచ్చిన సిల్టు పేరుకుపోయి ఇళ్ల ముందుకు చేరడంతో కాలు వేస్తే జారి కింద పడే ప్రమాదం పొంచి ఉంది. వీటితో పాటు వాన నీటిలో తేళ్లు, జెర్రులతో పాటు పాములు కూడా వచ్చి చేరుతున్నాయని వాపోతున్నారు. పుష్కర కాలనీలో ఐదేళ్ల క్రితం ఇచ్చిన 30 సెంట్ల తాత్కాలిక స్థలంలో వేసుకున్న పేదల గుడిసెల్లోకి వర్షం నీరు వచ్చి చేరింది. సామాన్లు నీళ్లలో నానుతున్నాయి. అధికారులు ఎవరూ అటు వైపు కన్నెత్తి చూడలేదని పేదలు విమర్శిస్తున్నారు. ఇళ్లలోకి నీరు వచ్చిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మోటార్లతో నీటిని తోడించాలని స్థానికులు కోరుతున్నారు.

రామయ్యకాలనీ..

పుష్కరకాలనీ..

అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం : సిపిఎం

తాడేపల్లి పట్టణంలోని బోటుయార్డు, ఎమ్మెల రామయ్య కాలనీ, సుందరయ్య నగర్‌లోని ప్రాంతాలోల పేదల ఇళ్లలోకి నీరు చేరడంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు కొట్టె కరుణాకరరావు, వేముల దుర్గారావు ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. నీరు నిలబడ్డ ప్రాంతాల్లో వెంటనే ఇంజన్ల ద్వారా నీటిని తోడించి బ్లీచింగ్, పినాయిల్ చల్లించాలని అధికారులను కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పర్యటించి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

అవుట్ పేషెంట్స్ సమస్యలు పరిష్కరిస్తాం

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఒపి లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం మెడికల్ ఒ పి ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఓపి లో రోజుకు 300 నుంచి 400 మంది రోగులు వస్తున్నారని చెప్పారు. దానివల్ల పలు సమస్యలు ఎదురవుతున్నట్లు ఆ విభాగం వైద్యులు తన దష్టికి తీసుకుని వచ్చారని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో ఒ పి కి అవసరమైన అవసరాలని తీర్చాలసిందిగా ఆదేశించినట్లు ఆయన చెప్పారు. ముఖ్యం గా ఒ పి లో ఫార్మసి కౌంటర్, ఈ సి జి, రూమ్ లను మార్పులు చేర్పులు చేయాలనీ ఆయన ఆదేశించారు. రోగుల కోసం కుర్చీలను ఏర్పాటు చేయాలనీ ఆయన చెప్పారు. అదేవిధంగా దాహార్తి తో అవస్థలుపడుతున్న రోగుల కోసం వాటర్ కూలర్ ను కూడా ఏర్పాటు కు దాతల సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు.

అంబులెన్సు వాహనాల పరిశీలన

ప్రభుత్వ అంబులెన్స్ వాహనాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సోమవారం స్వయంగా డ్రైవింగ్ చేసి పరీక్షించారు. వాహన కండిషన్ బాగోలేదని సంబంధిత డ్రైవర్లు సూపరింటెండెంట్ దష్టికి తీసుకుని వెళ్లారు. దూరపు ప్రయాణం చేసే సమయం లో బ్రేకులు సరిగా పడటం లేదని దాని వల్ల ఇబ్బందులు పడుతున్నామని డ్రైవర్లు వివరించారు. రంగంలో దిగిన ఆయన స్వయం గా పర్యవేక్షించారు. సమస్య ఎక్కడ ఉందొ తెలుసుకునేందుకు స్వయంగా ఆయనే అంబులెన్స్ డ్రైవింగ్ చేసి సమస్యను గుర్తించారు. వెంటనే మరమ్మత్తులు చేయాల్సిందిగా ఆయన ఆదేశించారు. సూపరింటెండెంట్ సమస్యను వెంటనే గుర్తించి పరిష్కరించినందుకు డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - చేబ్రోలు

కొత్తరెడ్డి పాలెం, మంచాల, పాతరెడ్డిపాలెంలలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం అనుకూలతలను సోమవారం పరిశీలించినట్లు తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ తెలిపారు. కొత్తరెడ్డిపాలెంలోని 12వ వార్డుకు సంబంధించిన పోలింగ్ కేంద్రం వున్న చోట కాకుండా ఆ ఏరియాలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వార్డు ప్రజల అర్జీ మేరకు పాఠశాలను ఆయన సందర్శించారు. పాతరెడ్డిపాలెం, మంచాల లలో పోలింగ్ కేంద్రాల బిల్డింగుల నిర్మాణాలు దెబ్బతిని సౌక ర్యంగా లేవని, తగిన ఏర్పాట్ల కోసం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. తహశీల్దార్‌తో పాటు ఏరియా బిఎల్ఒలు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఒ లతో సమీక్ష నిర్వహించారు.

మట్టి వినాయక ప్రతిమలు ఉపయోగించాలి: కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

రానున్న వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలనే ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ జి.రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. వెంకట శివ రామి రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ లలితాతో కలసి కాలుష్య నియం త్రణ మండలి వారు రూపొందించిన ' మట్టి వినాయక ప్రతిమను పూజిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం' అనే ప్రచార పోస్టరును ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను వినియోగించటం వల్ల పర్యా వరణానికి హాని కలుగుతుందన్నారు. మట్టితో చేసిన విగ్రహాల తయారీకి ప్రకృతిలో లభించే పత్తి, నార వంటి పదార్థాలను, సహజ సిద్ధమైన రంగులను వాడుతారన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలలో జిప్సం, గంధకం , మెగ్నీషియం వంటి హానికర రసాయనాలు వుంటాయన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

విగ్రహ మండపాలకు అనుమతి తప్పనిసరి

ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

ప్రజాశక్తి-గుంటూరు సిటీ

వినాయక చవితి పండగ సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసి పందిరి/మండపాలకు5 నుండి 10 మంది కమిటీగా ఏర్పడి కచ్చితంగా సంబంధిత పోలీస్ స్టేషన్ అధి కారి నుండి అనుమతి తీసుకోవాలని, గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ అన్నారు. వినాయక విగ్రహాలు ప్రతిష్టించి ఉత్స వాలు నిర్వహించేవారు ముందస్తు పోలీసులు అనుమతి పొంది, నిబంధనల అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని కోరారు. ప్రైవేట్ లేదా పంచాయతీ/ మున్సిపాలిటీ కి సంబంధించిన స్థలాలలో విగ్రహాన్ని ఏర్పాటు చేసేవారు ప్రవేటు స్థలమైతే స్థల యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ లేదా మున్సిపాలిటీ అనుమతి తో పాటు, విద్యుత్ శాఖ ,ఫైర్ డిపార్ట్మెంట్ అనుమతి కూడా తీసుకోవాలన్నారు .పండుగ రోజు నుండి నిమర్జనం వరకు జరిగే పూజలు, వేడుకల సందర్భాలలో ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు తలెత్తకుండా శాంతియుత వాతావర ణంలో ప్రశాంతంగా ప్రజలందరూ వినాయక చవితి పండు గను జరుపుకోవాలని ,ఏదైనా అవాంఛనీయ సంఘటనలో తలెత్తితే పూర్తి బాధ్యత నిర్వాహక కమిటీ సభ్యుల పైన ఉంటుందన్నారు.

మహిళా సాధికారతకు కుట్టు శిక్షణా కేంద్రాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

సమాజంలో మహిళా సాధికారతకు కుట్టు శిక్షణా కేంద్రాలు ఉపయోగపడతాయని విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ చెప్పారు. సోమవారం తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లోని మహిళా నైపుణ్య శిక్షణా కేంద్రం (అమరారెడ్డి భవన్)లో ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మహిళా కుట్టు శిక్షణ కంపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలో మహిళలు తమ కాళ్ల మీద తాము ఆర్థికంగా నిలబడేందుకు కుట్టు మిషన్ శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రస్తుతం కుట్టుమిషన్ శిక్షణ మాత్రమే 90 రోజుల పాటు నేర్పిస్తామని, నిష్ణాతులైన మాస్టర్ ఆధ్వ ర్యంలో ఈ శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. భవి ష్యత్తులో మగ్గం, ఎంబ్రాయిడింగ్, బ్యూటీషియన్, కం ప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, గణితంలో మెళకువలు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, మహిళా శిక్షణా నైపుణ్య కేంద్రం నిర్వాహకులు చింతా వెంకటరత్నం మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు అమరారెడ్డి భవన్‌లో కుట్టు శిక్షణ ప్రారంభ మవుతుందని చెప్పారు. డిసెంబర్ 15 వరకు 90 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రతిరోజూ శిక్షణ ఉంటుందన్నారు. పేర్లు నమోదు చేసుకునే వారు సం బంధిత దరఖాస్తుతో పాటు ఆదార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్టు ఫొటోతో పాటు 90 రోజుల శిక్షణకు రూ.వెయ్యి చెల్లించాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 79939 34411, 9866029486 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంటిఎంసి బాలోత్సవం నిర్వాహకులు డి.కోదండరామయ్య, బి.రామారావు, అంజిరెడ్డి, జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మురళీకృష్ణ, సుబ్బారెడ్డి

రోడ్డుపై నిలిచిన మురుగునీటిని పరిశీలిస్తున్న డిఎల్పిఒ లక్ష్మణరావు

'స్పందన' ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

గ్రామంలో ఇటీవల అభివృద్ధి కుంటుపడుతుందంటూ వార్డు సభ్యులు గ్రామస్తులు ఇటీవల గుంటూరు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం సాయంత్రం డి ఎల్ పి ఓ లక్ష్మణ్ రావు పెదనందిపాడులో విచారణ చేపట్టారు. సచివాలయంలో వివరాలు సేకరించారు రికార్డులు పరిశీలించారు. తాగునీటి చెరువులో నీరు వాసన వస్తున్నాయని వాడుకోవడానికి కూడా పనికిరాకుండా పోయాయని గ్రామస్తులు తెలిపారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.



యాచకులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి దేవస్థానం సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ కాపు సాధికారిక జిల్లా చైర్మన్ రేమినిశెట్టి హనుమంతరావు తన పుట్టినరోజును పురస్కరించుకొని సోమవారం యాచకులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం హాజరై వీటిని పంపిణీ చేశారు. తొలుత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమక్షంల రేమినిశెట్టి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కె.కృష్ణ చౌదరి, తాడేపల్లి నగర అధ్యక్షులు డి.శామ్యూల్, నాయకులు సిహెచ్ విజయ భాస్కర్, రత్న గోపాల్, ఎస్.కె సుల్తానా, జి.నాగేశ్వరరావు, ఆర్. శేషయ్య, అర్జునరావు పాల్గొన్నారు.

సామగ్రిని అందజేస్తున్న స్నేహ బృందం

పాఠశాలకు ఫ్యాన్, లైట్లు బహూకరణ

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన లైన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణ టాకీస్ రోడ్డులోని మున్ని మస్తాన్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్, ట్యూబ్ లైట్లు బహూకరించారు. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కె సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ క్లబ్ కార్యదర్శి ఎన్. కృష్ణమోహన్ కుమారుడు దిలీప్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని షేక్ దిల్ బహార్, ఎన్ కృష్ణమోహన్, వి.సాంబశివరావు, ఉపాధ్యాయులు షేక్ రబియా పాల్గొన్నారు.

గుర్తింపు పొందిన పేటెంట్‌కు మొదటి బహుమతి

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో జరుగుతున్న 46వ ఆవిర్భావ దినోత్సవంలో చలపతి ఫార్మసీ కాలేజి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పేటెంట్‌లో మొదటి బహుమతి పొందారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, గుంటూరు కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి, ఏఎన్‌యు విశ్రాంత వీసీ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.రాశేఖర్, ఏఎన్‌యు సిడిసి డీన్ కె.మధుసూదన్ చేతులమీదుగా బహుమతి అందచేశారు. ప్రొఫెసర్ రామారావు 'ఫార్ములేషన్ ఆఫ్ గ్లిమిప్రైడ్ కంట్రోల్డ్ రిలీష్ ట్రాన్స్‌డర్మల్ పాచెస్ బై యూసింగ్ నేచరల్ పాలీమర్స్' అనే శీర్షికపై పేటెంట్ హక్కును పొందారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు నిత్యం మందులు వాడే పనిలేకుండా అందుబాటులో ఉండే విధంగా సహజ రసాయనాల సహాయంతో ఎన్నో ప్రయోగాలు, పరిశోధనలు జరిపి ఈ ట్రాన్స్‌డర్మల్ ప్యాచ్‌ను తయారు చేశారు. ఈ ఒక్క ప్యాచ్‌ను చేతికిగానీ, చెవి వెనుకభాగంలోనీ అంటించుకుంటే మధుమేహాన్ని నియంత్రించవచ్చని, ఈ ఒక్క ప్యాచ్ మూడు రోజులు పనిచేస్తుందని, సహజ పాలీమర్స్‌తో తయారు చేయటం వల్ల తక్కువ ధరకు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రామారావుకు చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు, కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓ

అధికారులు మానవత్వంతో వ్యవహరించాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా, మండల అధికారులు మానవత్వం చూపాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. నరసరావుపేట కలెక్టరేట్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాల్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) ప్రజా సమస్యల వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 52 మంది వరకు ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి లకు వినతి పత్రాలను అందించారు. ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించిన జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు సంబంధిత శాఖల జిల్లా అధికారులకు వాటిని అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయానికి తరలి వచ్చిన ప్రజలకు పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాతలు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, దాతలను జిల్లా అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

మూడో శనివారం ఉద్యోగుల గ్రీవెన్స్

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతి నెల 3వ సోమవారం మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తామని, జిఎంసి ఉద్యోగులు తమ సర్వీస్‌కి సంబంధించిన సమస్యలపై అర్జీలు అందించవచ్చని నగర కమిషనర్ కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను భాధ్యతతో పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజల నుండి 22 ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 7, ఇంజినీరింగ్ విభాగం 7, రెవెన్యూ విభాగం 2, ప్రజారోగ్య విభాగం 4, ఉపాసెల్ విభాగం సంబంధించి 1, అకౌంట్స్ విభాగం కి సంబంధించి 1 ఫిర్యాదు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ తదితరులున్నారు.

ఘనంగా వర్సిటీ 46, 47 వ్యవస్థాపక దినోత్సవం

22 మందికి ప్రతిభా పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి - ఏఎన్‌యు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, విసి, కలెక్టర్ తదితరులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయం 46, 47వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వర్సిటీలోని డైక్ మన్ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకలకు విసి ప్రొఫెసర్ పి. రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విసి విశ్వవిద్యాలయ ప్రగతి నీ వివరించారు. బోధన, పరిశోధన రంగాలతో పాటు సమాజ సేవా రంగాలలో కూడా ఇక్కడ విద్యార్థులు ఉన్నతులుగా తీర్చిదిద్దబడు తున్నట్లు పేర్కొన్నారు. గడిచిన కొన్నేళ్లుగా సాధారణ స్థాయి నుంచి గ్లోబల్ ర్యాంకింగ్ సాధించేలా వర్సిటీ ఎదిగిందన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యవహారాల ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయం చేస్తున్న సంప్రదాయం ఎంతో గొప్పది అన్నారు. విశ్వవిద్యాలయాలు కూడా తగు సలహాలు ఇచ్చినట్లయితే ప్రభుత్వం వాటిని అనుసరించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా 46వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభావం తులైన వారు 11 మంది, 47లో 11, మొత్తం 22 మందికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలు మాట్లాడుతు తాము వర్సిటీకి సాంస్కృతిక వారధులుగా నిలుస్తామని తెలిపారు.

ప్రతిభా పురస్కార గ్రహీలు

46వ వ్యవస్థాపక దినోత్సవ పురస్కారాలు

పేరు	రంగం
డాక్టర్ జయప్రదా రామమూర్తి	శాస్త్రీయ సంగీతం
ఎం గిరిజా శంకర్	ప్రజాసేవ
గద్దె మంగయ్య	విద్యా దాతృత్వ రంగం
దాసరి రామకృష్ణ	సైన్స్ అండ్ టెక్నాలజీ
డాక్టర్ భవనం హనుమ శ్రీనివాస్ రెడ్డి	వైద్య సేవా రంగం
డాక్టర్ మాకినేని కిరణ్	వైద్య సేవా రంగం
నడింపల్లి హనుమంతరావు	కళా రంగం
మస్తార్జి	సామాజిక కళా రంగం
డాక్టర్ కోయి కోటేశ్వరరావు	సాహిత్య రంగం
అశిరయ్య	జానపద కళా రంగం
డాక్టర్ సిస్టర్ రోస లీన	సేవా రంగం

47వ వ్యవస్థాపక దినోత్సవ పురస్కారాలు

ఎం. వేణుగోపాల్ రెడ్డి	గుంటూరు జిల్లా కలెక్టర్
మల్లడి సూరిబాబు	క్లాసికల్ మ్యూజిక్
ఆర్. గోపాల కృష్ణ	విద్యా రంగం
డాక్టర్ గీతా రెడ్డి	మహిళా సాధికారత రంగం
శారదా శంగేరి	సాహిత్య సేవా రంగం
డాక్టర్ చిట్టినేనిలక్ష్మీ నారాయణ	రంగస్థలం టీవీ రంగం
ఆచార్య వడ్లమూడి విజేత	ప్రత్యేక విభాగ రంగం
డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ	ప్రజా వైద్య రంగం
జయరాజ్	జాన పద సంగీత రంగం
సయ్యద్ మౌలాలి	గ్రామీణ పారిశ్రామిక రంగం
పద్మశ్రీ దర్శనం మొగులయ్యా	కళా రంగం

డాక్టర్ జయప్రదా రామమూర్తి కి పురస్కారం

డాక్టర్ రమణా ఎసెస్వీకి పురస్కారం

గద్దె మంగయ్యకు పురస్కారం

రేపటి నుండి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-గుంటూరు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

రీఓపెన్ అయిన పిటీషన్లు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా సంపూర్తిగా పరిశీలించి వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి , సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. వెంకట శివరామిరెడ్డి , డిప్యూటీ కలెక్టర్ లలితా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 45 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందిన స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన ఫిర్యాదులు తిరిగి రీ ఓపెన్ కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రీఓపెన్ అయిన 49 పిటీషన్లను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ద వహిస్తుందని చెప్పారు. ఈనెల 15వ తేది నుండి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ నెల 13న కాకుమాను, 17న మేడికొండూరు, 20 కొల్లిపర, 22 దుగ్గిరాల, 27 పెదకాకాని, 29 పెదనందిపాడులలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్పందనలో జెడ్పీ సిఈఓ జె.మోహన్ రావు, డిఆర్‌డిఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ యుగంధర్ కుమార్ , సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధన రావు, పంచాయతీ రాజ్ ఎస్.ఇ గుర్రం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నా..

నాలుగేళ్లుగా ట్రై మోటార్ వాహనం కోసం తిరుగుతున్నా మంజూరు చేయట్లేదని చేబ్రోలు మండలం, తోట్లపాలెంకు చెందిన దివ్యాంగుడు బి.జాన్‌వెస్లీ స్పందనలో అర్జీ అందచేశాడు. 2019లో ట్రై మోటారు వాహనం కోసం దరఖాస్తు చేసుకున్నానని, అప్పటి నుంచి అనేక మందికి మంజూరు చేసిన తనకు అర్జీ మాత్రం పక్కన పెట్టారన్నారు. దీనిపై ఈ సంవత్సరంలో మే నెలలో స్పందనలో ఫిర్యాదు చేశానని, సమస్య పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారుల్ని ఆదేశించారన్నారు. దివ్యాంగుల శాఖ అధికారులు జగనన్నకు చెబుదాంలో తిరిగి దరఖాస్తు చేసుకోమని చెప్పటంతో తాను మళ్లీ దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. అయితే సమస్య పరిష్కారం అయినట్లు మెస్సేజ్ వచ్చినా తనకు మాత్రం వాహనం అందలేదన్నారు. గత రెండు నెలల క్రితం కూడా అనేక మందికి దివ్యాంగుల శాఖ ట్రై మోటారు వాహనాలు అందచేశారని, తనకు మాత్రం ఇవ్వలేదన్నారు. కావున తనకు న్యాయం చేయాలని కోరారు.